




WWW.VIJAYAKERATAM.COM RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

# విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY






ఆగస్టు 20 గురువారం 2026 | సంపుటి : 18 | సంచిక : 196 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

THURSDAY AUGUST 20 2026 | VOL:18 | ISSUE: 196 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:MD. MaKsood Ahmed


## రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మల్లు రవి స్పందన

పరకాల టికెట్ మళ్లీ రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఇస్తామన్న రేవంత్

పార్టీలో క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవన్న మల్లు రవి

తెలంగాణ మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని చేసిన ఘాటు వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో

(మిగతా 2వ పేజీలో..)



## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందన్న ఖర్గే

కేంద్రం నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపై నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని విమర్శ

ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున



# అక్రమ సంపాదనతో తప్పుడు ప్రచారం

కర్నాటక, తమిళనాడులో చేతబడి పూజలు

కరువు రావాలని, రైతులు నష్టపోవాలని కోరుతున్నారు

చెట్లకు కట్టేసి కొట్టాలి

బడుగు, బలహీనవర్గాలను గొర్రెలు, బర్రెలు పెంచుకోమన్నారు

సర్వాయి పాపన్న పోరాటం స్ఫూర్తిదాయకం : విగ్రహావిష్కరణలో సీఎం ఏ రేవంత్‌రెడ్డి



పదేండ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన వాళ్లు తమ దగ్గర ఉన్న అక్రమ సంపాదనతో మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. వారి ప్రచారాన్ని ప్రజలు నమ్మట్లేదని తెలిసి, రాష్ట్రంలో కరువు రావాలని, రైతులు నష్టపోవాలని అఘోరా రావు చేతబడి పూజలు చేయించి వచ్చాడని విమర్శించారు. అధికారం కోసం ఇంతకు దిగజారుతారా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో చేతబడి చేసేవాళ్లను చెట్లకు కట్టేసి కొడతారని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల యువతను బర్రెలు, గొర్రెలు పెంచుకోవాలనీ, చెప్పులు కుడుతూ, చేపలు పట్టుకోండని చెప్పిందని గుర్తుచేశారు. కానీ తాము ఆ వర్గాల పిల్లలు ఉన్నత చదువులు చదవాలని కాంక్షిస్తున్నామనీ, రాష్ట్రాభివృద్ధిలో వారి భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తున్నామని వివరించారు. మంగళవారంనాడిక్కడి ట్యాంక్‌బండ్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ ఇందిరమ్మ పాలనలో బహుజనుల తెలంగాణ.సామాజిక న్యాయం, జీవించడానికి స్వేచ్ఛ ఉందని నిరూపించామన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని చూసి, ప్రజలు పోరాట స్ఫూర్తి పొందాలన్నారు. ఆయన బహుజనులతో

(మిగతా 2వ పేజీలో..)

## మాజీ మంత్రి హరీశ్ రావు హౌస్ అరెస్ట్

హైదరాబాద్ : : సనత్‌నగర్ ఆస్పత్రిని సందర్శించేందుకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను పోలీసులు



(మిగతా 2వ పేజీలో..)

## సీటు రగడ.. సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

పరకాల టికెట్‌పై రేవంత్‌ను ప్రశ్నించిన కొండా సుష్మిత

కొండా మురళికి ఎమ్మెల్సీ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్న

బీసీల పట్ల వివక్ష చూపుతున్నారని రేవంత్‌పై ఆరోపణలు

తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ టికెట్ వ్యవహారం మరోసారి వేడెక్కింది. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పిలుపునిచ్చారు. దీనిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్రంగా



(మిగతా 2వ పేజీలో..)


## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం.... అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్' విధానంలో భాగంగానే ఈ సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను

(మిగతా 2వ పేజీలో..)



## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు: అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు



గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం

కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం

భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు

(మిగతా 2వ పేజీలో..)

## యూ-టర్న్ తీసుకున్న తమిళనాడు ప్రభుత్వం.. విద్యార్థుల నిరసనలపై నిషేధాజ్ఞల ఉపసంహారణ

విద్యార్థులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొనకుండా చర్యలు చేపట్టాలంటూ సర్క్యులర్ జారీ చేసిన తమిళనాడు ప్రభుత్వం

విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత

ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన విజయ్ సర్కార్

తమిళనాడు ప్రభుత్వం విద్యార్థుల ఆందోళనలు, నిరసనలపై జారీ చేసిన వివాదాస్పద ఆదేశాలను వెనక్కి తీసుకుంది. ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు, యువత వివిధ నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలో



(మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

## మాజీ మంత్రి హరీశ్ రావు హౌస్ అరెస్ట్

మొదటి పేజీ తరువాయి)

నిర్బంధించారు. కోకాపేటలోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హరీశ్‌రావును హౌస్ అరెస్ట్ చేసిన విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. సనత్‌నగర్ ఆస్పత్రి సందర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తనను అక్రమంగా నిర్బంధించడంపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లోని లోపాలు, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులు, నిర్బంధాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమని విమర్శించారు. పోలీసుల నిర్బంధాలతో ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హరీశ్‌రావు మండిపడ్డారు.

## సీటు రగడ.. సీఎం రేవంత్‌పై కొండా సుష్మిత సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉండగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు.పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి టికెట్ ఇస్తామని రేవంత్‌రెడ్డి ఎలా చెబుతారని సుష్మిత నిలదీశారు. పరకాలలో రేవూరి ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో టికెట్లను పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, నేతలు కాదని అన్నారు.తన తండ్రి కొండా మురళిని రేవంత్‌రెడ్డి ఎందుకు పక్కన పెడుతున్నారని సుష్మిత ప్రశ్నించారు. కొండా మురళి సాధారణ నేత కాదని, కింగ్ మేకర్ అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని కాంగ్రెస్‌లో తొలుత కోరింది కొండా దంపతులేనని గుర్తుచేశారు. పీసీసీ చీఫ్ అయిన తర్వాత రేవంత్‌రెడ్డి తమ ఇంటికి వచ్చారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని సుష్మిత పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆ హామీ ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సంగారెడ్డి టికెట్‌ను అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పిన సీఎం.. పరకాల విషయంలో మాత్రం తానే ఎలా నిర్ణయం చెబుతారని నిలదీశారు. యువతకు టికెట్లు ఇవ్వాలని చెబుతూ రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తామని చెప్పడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పూటకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం పదవిని కాపాడుకోవాలంటే నిబద్ధత అవసరమని వ్యాఖ్యానించారు. బీసీల పట్ల వివక్ష చూపుతున్నారంటూ ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా సుష్మిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మరో 'పొంగు' ఉందని, ఆ పొంగు ఎక్కువ కాలం ఉండదని అన్నారు. ముఖ్యమంత్రి ఎవరో తెలియని పరిస్థితి ఉందంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి.

## రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలపై మల్లు రవి స్పందన

మొదటి పేజీ తరువాయి)

తీవ్ర రాజకీయ దుమారం రేపుతున్నాయి. పరకాల అసెంబ్లీ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే రాబోయే ఎన్నికల్లో మళ్లీ టికెట్ ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించడమే ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. పరకాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కొండా సుస్మిత మాట్లాడుతూ, ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే టికెట్ ఎలా ప్రకటిస్తారంటూ సీఎం వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొండా మురళికి ఎమ్మెల్సీ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తే సీఎం రేవంత్ రెడ్డి, ఆయన అన్నదమ్ముల భాగోతాలు, స్కాములను బయటపెడతానని హెచ్చరించడం ప్రకంపనలు సృష్టించింది. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా తప్పుపట్టారు. సీఎం ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న సుస్మిత వ్యాఖ్యలపై పూర్తి సమాచారం తెప్పించుకున్న తర్వాత క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పార్టీలో లక్ష్మణరేఖను దాటి ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.మరోవైపు ఈ అంతర్గత వివాదంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ స్పందిస్తూ, పూర్తి నివేదిక ఇవ్వాలని పీసీసీ నాయకత్వాన్ని ఆదేశించారు. మరోవైపు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పందిస్తూ, పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అందరికీ శిరోధార్యమని, అనవసర వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వబోనని తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వంపై ఖర్గే తీవ్ర విమర్శలు.. విద్యార్థులు, యువత సమస్యలపై సీడబ్ల్యూసీలో కీలక చర్చ

మొదటి పేజీ తరువాయి)

ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఉన్నత విద్య సామాన్యులకు భారంగా మారుతోందని, ప్రముఖ విద్యాసంస్థలన్నీ క్రమంగా ఆర్ఎస్ఎస్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్నాయని ఆయన ఆరోపించారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ పరీక్షల కుంభకోణాలే స్వాగతం పలుకుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, నిర్లక్ష్య వైఖరి వల్ల యువత రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా యువత లేవనెత్తిన అసలైన సమస్యలకు సమాధానం చెప్పకుండా తప్పించుకున్నారని ఖర్గే విమర్శించారు. యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ 'విద్య నుంచి ఉపాధి వరకు రోడ్‌మ్యాప్'ను రూపొందించాల్సి ఉందన్నారు. అలాగే అయోధ్య రామాలయం విరాళాల చోరీ వివాదంపై స్పందిస్తూ, నిధుల గోల్‌మాల్‌పై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను జవాబుదారీ చేయాలని డిమాండ్ చేశారు.

# అక్రమ సంపాదనతో తప్పుడు ప్రచారం

మొదటి పేజీ తరువాయి)

కలిసి దండయాత్ర చేసి గోల్కొండ కోటపై జెండాను ఎగురవేశారని చరిత్రను గుర్తుచేశారు. మహారాష్ట్రలో శివాజీ విగ్రహానికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారో, తెలంగాణలో బహుజనులు కూడా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి అంతే ప్రాధాన్యత ఇస్తారనీ, బ్రిటిష్ లైబ్రరీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విశేషాలు ఉన్నాయనీ, అక్కడి నుంచే మనం ఆయన చరిత్రను తెలుసుకున్నామని వివరించారు. తెలంగాణ అమరవీరుల స్థూపం స్థాయిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. పాలమూరు జిల్లాలో పండుగ సాయన్న పోరాటం, పౌరుషం అందరికీ తెలుసునని. అక్టోబర్ 22న ఆయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని చెప్పారు. 2029 ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్ నేతృత్వంలోనే మళ్లీ అధికా రంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుం దనీ, గ్రామాల్లో అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా అందరికీ పింఛన్లు వచ్చేలా యువకులు సహకారాన్ని అం దించాలని కోరారు. ప్రభుత్వ పొలాలు, కాల్వ గట్లు, నీటిపా రుదల ప్రాజెక్టుల వద్ద ఈత, తాటి చెట్లు నాటేలా చూస్తామనీ, కులవృత్తులు చేసుకుంటూనే, తమ పిల్లల్ని బాగా చదివించి, వైద్యులు, న్యాయవాదులు, ఐఏఎస్‌లుగా మార్చి తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాముల్ని చేయాలని కోరారు. పిల్లల తలరాతలను విద్యమాత్రమే మార్చగలుగుతుందన్నారు. ఉన్నతమైన విద్య, ఆకలి లేని చదువును అందించే బాధ్యత తనదేనని చెప్పారు. గౌడ కులస్తుల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇప్పటి వరకు వారికి యాభై వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేశామనీ, ప్రమాదవశాత్తు చనిపోతే ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లిస్తున్నామని తెలిపారు. రెండోసారి 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య పరిపాలనలో ఉన్న వ్యత్యాసాన్ని సభికులకు వివరిం చారు. గత పాలకులది కుటుంబ న్యాయం అనీ, తమది సామాజిక న్యాయం అని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ ప్రభుత్వం అందరిదీ అనీ, ఎలాంటి లోటుపాట్లుఉన్నా మాట్లాడుకుని ముందుకు వెళ్దామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మెన్లు, ఎంపీలు పాల్గొన్నారు.

## యూ-టర్న్ తీసుకున్న తమిళనాడు ప్రభుత్వం.. విద్యార్థుల నిరసనలపై నిషేధాజ్ఞల ఉపసంహరణ

మొదటి పేజీ తరువాయి)

పాల్గొనకుండా అడ్డుకు నేందుకు చర్యలు చేపట్టాలంటూ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేస్తున్నట్లు విజయ్ సర్కార్ ప్రకటించింది. ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌లో ముఖ్యంగా లెఫ్ట్ పార్టీలు, కాక్రోచ్ జనతా పార్టీ చేపడుతున్న ఆందోళనల్లో విద్యార్థులు పాల్గొనకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడంపై విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే ప్రాథమిక హక్కును కాలరాసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో, ఈ వివాదం తీవ్ర రూపం దాల్చక ముందే స్పందించిన ప్రభుత్వం.. తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటూ యు-టర్న్ తీసుకుంది.

## గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు: అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి)

ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి, తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ-మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు. వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త ఛైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు. జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా, మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు. గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం.... అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్

మొదటి పేజీ తరువాయి)

ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ. 5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు. ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో రెండో మహిళా విశ్వవిద్యాలయంగా 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు మార్గం సుగమమైందని మంత్రి తెలిపారు. మా ప్రభుత్వ విధానం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని, దరఖాస్తుల ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసేలా ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని ఆన్‌లైన్‌లో తీసుకొస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ వంటి 22 పారిశ్రామిక క్లస్టర్లకు అనుగుణంగా వర్సిటీలలో పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యమని లోకేశ్ పేర్కొన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా, పరిశ్రమలకు అనుసంధానంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే ఈ సవరణల ముఖ్య ఉద్దేశమని మంత్రి వివరించారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ప్రిన్సిపల్స్ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం తన ఛాంబర్లో ఇంటర్ విద్య పై జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దశ్రు నాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ తో సమీక్షించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలాల్లో మెరుగైన ఫలితాలు వచ్చినప్పుడు ప్రవేశాల సంఖ్య కూడా పెరుగుతుందని కలెక్టర్ అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో ఉన్న 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు గాను 9 కళాశాలలో విద్యార్థుల నమోదు శాతం పెరిగిందని,నమోదు శాతం తక్కువగా ఉన్న కళాశాలలు ప్రిన్సిపల్స్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి నమోదు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని ,కళాశాలలో చేరిన విద్యార్థులందరూ మధ్యలో ఇంటర్ కళాశాల మానివేయకుండా చూడాలని ,కనీసం 75% హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా హాజరు శాతం తక్కువగా ఉన్నచోట విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖలు పంపాలని చెప్పారు. తరగతి గదిలో వెనుకబడిపోయిన విద్యార్థులను గుర్తించి వారికి సాయంత్రము 4 నుండి 5 లేదా మధ్యలో ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, ఒక్కో విద్యార్థిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వారు చదువులో పురోగతిలోకి వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులం దరూ తప్పక ఉత్తీర్ణులు కావాలని, ఈ సంవత్సరం



ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని అన్నారు. ఇంటర్ విద్య తర్వాత ఖాళీగా ఉండకుండా ఏదో ఒక వృత్తి, ఉద్యోగాలలో స్థిరపడే విధంగా చదువును నేర్పించాల్సిన అవసరం ఆధ్యాపకులు, ప్రిన్సిపల్స్ పై ఉందని చెప్పారు. సెప్టెంబర్లో మరోసారి ఎఫ్ ఎల్ ఎన్ పరీక్ష నిర్వహించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన పనులపై కలెక్టర్ సమీక్షిస్తూ పనులు ప్రారంభించిన చోట త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# సెప్టెంబర్ 9న చలో వరంగల్ ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

**చౌటుప్పల్, ఆగస్టు 19 విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్**


యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ చౌటుప్పల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ చౌటుప్పల్ మండల ఇంచార్జి బోయ లింగస్వామి మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బిర్రు మహేందర్ మాదిగ మాట్లాడుతూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సెప్టెంబర్ 9న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ ఫలాలు అర్హులైన వారికి అందేలా కృషి చేయాలని సూచించారు. మాదిగ జాతి హక్కులు, ఆత్మగౌరవం కోసం మందకృష్ణ మాదిగ 33 సంవత్సరాలుగా నిరంతరం ఉద్యమిస్తున్నారని తెలిపారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, మాదిగ జాతిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. చౌటుప్పల్ మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరిగే జాతీయ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.నూతన మండల కమిటీ ఎన్నిక అనంతరం ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా చీమకండ్ల శ్రీనివాస్ మాదిగ, అధికార ప్రతినిధిగా బోయ నిరంజన్ మాదిగ, టౌన్ అధ్యక్షుడిగా దోనకొండ కిరణ్ మాదిగ,



అధికార ప్రతినిధిగా ఉపేందర్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా ముత్యాల గణేష్ మాదిగలను ఎన్నుకున్నారు.నూతన కార్యవర్గ సభ్యులకు జిల్లా ఇంచార్జి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బోయ రామచందర్, ఉదరి నరసింహ, ఉదరి వెంకటేష్ మహాజన్, కట్టెల లింగస్వామి, ఉదరి శ్యాంసుందర్, ఆరుట్ల లింగస్వామి, బోదుల లింగస్వామి, సుక్క కృష్ణ, ఎర్ర శంకర్, కుంటి గణేష్, ఉదరి రమేష్, దళిత రత్న అవార్డు గ్రహీత ఉదరి నరసింహ, బోయ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో ఫోటో జర్నలిస్టులకు సన్మానం

నల్లగొండ: 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లగొండలో ఫోటో జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ఫోటో జర్నలిస్టులతో కలిసి కేక్ కట్ చేసి ఫోటోగ్రఫీ డే శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫోటోగ్రఫీ పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు సాధించిన సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ కంది భజరంగ్ ప్రసాద్ను, ఇతర ఫోటోగ్రాఫర్లను మేయర్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఒక ఫోటో వెయ్యి మాటలతో సమానమని, సమాజంలో జరిగే ప్రతి ముఖ్యమైన సంఘటనను ప్రజల కళ్లముందుకు తీసుకురావడంలో ఫోటోగ్రాఫర్లు, ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. చరిత్రకు దృశ్య సాక్ష్యాలుగా నిలిచే ఫోటోలను అందిస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా మంచి ఫోటో వెనుక ఫోటోగ్రాఫర్ ప్రతిభ, పరిశీలనా శక్తి, సృజనాత్మకత ఎంతో ముఖ్యమన్నారు.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అవార్డులు సాధించిన ఫోటో జర్నలిస్టులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఫోటోగ్రాఫర్లు కంది శ్రీనివాస్ ప్రసాద్, కనకయ్య, భవాని ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, వంగాల అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అక్రమాలు.. ఏఈ ఉద్యోగం నుంచి తొలగింపు

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్ధిదారు నుండి డబ్బులు తీసుకున్నట్లు విజిలెన్స్ విచారణలో రుజువైనందున నల్గొండ జిల్లా, తిరుమలగిరి సాగర్ మండల గృహ నిర్మాణ శాఖ ఔట్సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ బుక్యా గోపిని వెంటనే ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.ఏ ఈ బుక్యా గోపి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు డబ్బులు తీసుకుంటున్నారని లబ్ధిదారులు రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ కు ఫిర్యాదు చేయగా, ఈ ఫిర్యాదు పై స్పందించిన రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఈ విషయంపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. విజిలెన్స్ విచారణలో ఏ ఈ డబ్బులు తీసుకున్న విషయం నిజమని తేలడంతో,విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరులో అక్రమాలకు పాల్పడినందుకు గాను భూక్య గోపిని తక్షణమే ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎవరు అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల కు సంబంధించి అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ఎవరు అక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఫిర్యాదులను లబ్ధిదారులు తనకు గాని, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 18004251442, 18005995991 లకు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

# వసతి గృహాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్

రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో చదువుతోపాటు, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ప్రిన్సిపల్స్ ను ఆదేశించారు.బుధవారం ఆయన నల్గొండ జిల్లా, గుండ్లపల్లి( డిండి) లోని సాంఘిక సంక్షేమ



గురుకుల బాలికల పాఠశాల/ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల ఆవరణ,డార్మెటరీ,కిచెన్,స్టోర్ రూమ్, వాష్ రూమ్స్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో చెత్తను ఎప్పటికప్పుడు గ్రామపంచాయతి ట్రాక్టర్ ద్వారా తీసుకువెళ్లాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి జంగయ్య ను ఆదేశించారు.వాష్ రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని,వాష్ రూమ్ లకు డోర్ లు పెట్టించాలని,అలాగే అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని,ప్రభుత్వం ఇటీవలే పాఠశాల/కళాశాలలో సివిల్ పనుల నిమిత్తం 26 లక్షల రూపాయలు మంజూరు చేసినందున డ్రైనేజీ,తాగునీటి పైప్ లైన్ పనులు,పాఠశాల భవన మరమ్మతులు, తదితర పనులను వెంటనే చేపట్టాలని డి ఈ శైలజను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్టోర్ రూమ్ ను సందర్శించి సరుకుల స్టాక్ రిజిస్టర్ ను తనిఖీ చేశారు.స్టాక్ రిజిస్టర్ ఎప్పటికప్పుడు నిర్వహించాలని,గడువుదాటిన సరుకులు వాడవద్దని,నెలకు సరిపడా సరుకులు మాత్రమే తెప్పించుకోవాలని,తాజా కూరగాయలు వాడాలని,పుచ్చిపోయినవి వాడవద్దని ప్రిన్సిపల్ శిరీష, స్టోర్ కీపర్ల ను ఆదేశించారు.వంట సరుకులు వృధా చేయవద్దని,రోజుకు సరిపోయినంత సరుకులు వాడాలని,వంట మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,చేతులకు గ్లౌజులు ,తలకు కవర్ ధరించాలని వంట వారిని ఆదేశించారు.బాలికలకు ఆత్మరక్షణలో భాగంగా కరాటే వంటివి నేర్పించాలని ప్రిన్సిపాల్ ను ఆదేశించారు.ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి చదువు,సమస్యలు,తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్,ఎంపిడివో వైజన,సర్పంచ్ రవి తదితరులు ఉన్నారు.

## యూనిఫామ్ క్లాత్ నాణ్యతపై విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన

**చౌటుప్పల్, ఆగస్టు 19 ( విజయ కెరటం ప్రతినిధి సయ్యద్ భాయ్)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కొత్తగా అందిస్తున్న యూనిఫామ్ క్లాత్ నాణ్యతపై విద్యార్థులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త యూనిఫామ్‌ల కోసం అందించిన వస్త్రం నాణ్యతగా లేదని, పలుచగా ఉండటంతో పాటు ఎక్కువ కాలం మన్నికగా ఉండేలా కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్‌లు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త యూనిఫామ్ డిజైన్‌తో పాటు రెండు జతల దుస్తులు అందించే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే కొన్ని



పాఠశాలల్లో అందుతున్న క్లాత్ నాణ్యతపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.“ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు యూనిఫామ్‌లు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పుడు, క్లాత్ నాణ్యత విషయంలో రాజీ పడకూడదు” అని తల్లిదండ్రులు కోరుతున్నారు. యూనిఫామ్ క్లాత్‌ను సంబంధిత అధికారులు పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో నిర్ధారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.విద్యార్థుల నుంచి నేరుగా యూనిఫామ్‌లు, షూస్, ఇతర విద్యా సామగ్రి నాణ్యతపై అభిప్రాయాలు తీసుకోవాలని ప్రభుత్వం కూడా గతంలో అధికారులను ఆదేశించింది.విద్యార్థులకు నాణ్యమైన యూనిఫామ్‌లు అందేలా అధికారులు వెంటనే స్పందించి, క్లాత్ నాణ్యతను తనిఖీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



విజయకెరటం
తెలుగు దినపత్రిక

## గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం 4వ మహాసభలకు జెండా ఆవిష్కరణ

**చౌటుప్పల్ ఆగస్టు 19 (లోకం తీరు ప్రతినిధి సయ్యద్ భాయ్**



గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహించనున్న 4వ మహాసభలను పురస్కరించుకొని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జీఎంపీఎస్ జెండాను గుణమోని ఐలయ్య ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు గుణమోని ఐలయ్య మాట్లాడుతూ.. గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 30 వసంతాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. గత 30 సంవత్సరాల కాలంలో సంఘం సాగించిన ఉద్యమాలు, సాధించిన విజయాలు, గొర్రెల మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు భీమనగోని బాలరాజ్, గుణమోని కృష్ణ, మల్లయ్య, నరసింహ, అశోక్, గుణమోని అభిరామ్, పోలేబోయిన సారయ్య, అచ్చిని లక్ష్మమ్మ, నెల్లికంటి శంకరమ్మ, కొత్త పార్వతమ్మ, గుణమోని రాములమ్మ, గుణమోని పద్మ, యాదమ్మ, గుణమోని పుష్ప, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణలో పారదర్శకతకు పెద్దపీట

ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం మ్యాపింగ్ కానీ, జాబితాలో పేర్లు తేడా ఉన్న కేసులకు సంబంధించి నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియపై ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్గొండ జిల్లాలో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం 33,818 అన్‌మ్యాపింగ్ 2,34,972 అనామలీస్ ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు.జిల్లాలో ప్రస్తుతం 6 ఈఆర్ఓలు, 12 మంది ఏఈఆర్ఓలు ఉన్నారని, అదనంగా మరో 12 మంది ఏఈఆర్ఓలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ తెలిపారు.ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవడంతో పాటు, క్షేత్రస్థాయిలో బూతు స్థాయి అధికారులు, సూపర్వైజర్లు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి పూర్తి అవగాహన కల్పిస్తామని చెప్పారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి బి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ అనంతరం జారీ చేసే నోటీసులను సంబంధిత బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు సక్రమంగా అందజేయాలని చెప్పారు. నోటీసులు అందించిన వ్యక్తుల సంతకాలను తీసుకోవాలని, డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు.అదేవిధంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించిన దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, వారికి పూర్తి వివరాలను తెలియజేయాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పూర్తిగా పారదర్శకంగా రూపొందించేలా లక్ష్యంగా పనిచేయాలని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా రెవిన్యూ అధికారి దశరథ ,ఎలక్షన్ అధికారులు హాజరయ్యారు.



## “పాఠాలు చెప్పిన టీచర్‌ను హతమార్చిన విద్యార్థులు”







**జిల్లాలో సంచలనం సృష్టించిన కొండమల్లేపల్లి నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి హత్య కేసును ఛేదించిన నల్లగొండ జిల్లా పోలీస్.**

**శాస్త్రీయ దర్యాప్తుతో కీలక ఆధారాలు, దోపిడీ కోసం దారుణ హత్య,సోషల్ మీడియాలో హత్యపై అన్వేషణా, ఇద్దరు పదో తరగతి విద్యార్థుల అరెస్ట్ .**

**‘బాబు’అనే ఒకే ఒక్క మాటతో వీడిన హత్య మిస్టరీ .**

**రూ.1.54 లక్షల నగదు ,కత్తి, ఐఫోన్, సెల్‌ఫోన్లు స్వాధీనం.**

**జిల్లా యస్పీ శరత్ చంద్ర పవార్ ఐపితఎస్**

**క్రైమ్ నం. 150/2026, సెక్షన్ 103 దీచీూ, కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్.**

కేసు వివరాలు

తేదీ 11-08-2026న కొండమల్లేపల్లి పరిధిలో నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ కల్లు రూపారెడ్డి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసును జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు సవాలుగా తీసుకుని వెంటనే దేవరకొండా డియస్పీ గారి అద్వర్యంలో 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.నేరస్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఆధునిక దర్యాప్తు పద్ధతులను ఉపయోగిస్తూ అన్ని కోణాల్లో విచారణ కొనసాగించాలని ప్రత్యేక బృందాలకు ఎస్పీ గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కేసు దర్యాప్తులో భాగంగా ఫోరెన్సిక్ ఆధారాలు, ఫింగర్‌ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరా ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలు, పాత నేరస్తుల వివరాలు, అనుమానితుల కదలికలు, రౌడీషీటర్ల వెరిఫికేషన్ తదితర అంశాలను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా పరిశీలించారు.హత్య జరిగిన ప్రదేశంతో పాటు పరిసర ప్రాంతాల్లో సుమారు 30 కిలోమీటర్ల పరిధిని 360 డిగ్రీల కోణంలో పరిశీలిస్తూ, సుమారు 70 సీసీ కెమెరాల ఫుటేజీలను ప్రతిరోజూ రాత్రి పగలు కష్టపడి విశ్లేషించారు.టెక్నికల్ అనాలసిస్, ఇన్ఫర్మేషన్ టీమ్స్‌తో కలిపి మొత్తం 5 ప్రత్యేక బృందాల్లో సుమారు 40 మంది పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమించి 80 మందికి పైగా అనుమానితులను విచారించారు.

కేసును కీలక మలుపు తిప్పిన … ఒకే ఒక్క పదం!

హత్యకు ముందు రూపారెడ్డి గారు తన చిన్నమ్మతో ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో చివరిగా “బాబు” అని పలికారు. అనంతరం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో, “ఆమె చివరిగా బాబు అని ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు?” అనే ప్రశ్న పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారింది.ఈ కోణంలో విచారణ చేపట్టగా, రూపారెడ్డి గారు తన పాఠశాలలో విద్యార్థులను సాధారణంగా “బాబు” అని పిలిచేవారని పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో దర్యాప్తు పాఠశాల విద్యార్థుల వైపు మళ్లింది.ప్రిన్సిపల్ మరణానికి సంతాప సూచకంగా పాఠశాలకు వరుసగా ఆరు రోజులు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులను విచారించడంలో కొంత ఆలస్యం జరిగింది. పాఠశాల పునఃప్రారంభమైన అనంతరం పోలీసులు విద్యార్థులను ఒక్కొక్కరిని సున్నితంగా విచారిస్తూ దర్యాప్తును కొనసాగించారు.ఈ క్రమంలో రెండు రోజులుగా పాఠశాలకు హాజరుకాని కొంతమంది విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు.వారిలో అయిదుగురు విద్యార్థులు కొత్తగా జల్సాలకు అలవాటు ఐనా వారిపై ప్రత్యేక దృష్టి సాదించినారు. నేరస్థలం లో లభించిన సిసిటివి ఫూటేజ్ లు అనుమానిత విద్యార్థులతో సరిపోలడంతో వారిపై ప్రత్యేక దృష్టి సారించి నేరానికి పాల్పడినది సదరు విద్యార్థులే అని నిర్ధారించుకొని నమ్మదగిన సమాచారం మేరకు ఈ రోజు ఉదయం 11:30 గంటల సమయంలో పెండ్లిపాకల “శ” రోడ్డు నుండి మల్లేపల్లి వస్తున్నగా దొనియాల ∝ రోడ్ వద్ద బైక్‌పై వస్తున్న పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకుని సున్నితంగా విచారించి తనిఖీ చేయగా లోదుస్తుల్లో నగదు దాచుకున్నట్లు గుర్తించారు. అందులో సుమారు రూ. 1.54 లక్షల నగదు, అలాగే స్వాదీన పరుచుకున్న మూడు 500 నోట్లపై రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. నగదు ఎక్కడి నుంచి వచ్చిందని విచారించగా, ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకు పాల్పడి నగదును అపహరించినట్టు వెల్లడించినారు

చట్టంతో సంఘర్షణ పడిన బాలురు..

1).జీజూ-1, వయస్సు: 16 సంవత్సరాలు, పదో తరగతి విద్యార్థి, (నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్) పుల్సింగ్ తండా, కొండమల్లేపల్లి మండలం, నల్లగొండ జిల్లా.

2). జీజూ-2,వయస్సు: 16 సంవత్సరాలు, పదో తరగతి విద్యార్థి, (నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్) పిల్యతండ, కొండమల్లేపల్లి మండలం, నల్లగొండ జిల్లా.

హత్యకు పథకం ఎలా రచించారు?

నిందితులు ఇద్దరూ నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ పాఠశాల నందు 10 తరగతి చదువుతు హాస్టల్ నందు ఒకే గాది లో ఉంటున్నారు. వీరు జల్సాలు, చెడు వ్యసనలకు అలవాటుపడి హాస్టల్ గదులలో వారి తల్లి తండ్రులకు తెలియ కుండ సెల్ ఫోన్ లు వినియోగిస్తూ సోషల్ మీడియా , యూట్యూబ్ లలో డబ్బులు తేలికగా ఏలా సంపాదించాలి అని వెతుకెవారు. గతనెలలో వీరిద్దరు హాస్టల్ లో డబ్బులతో ప్రికిపాల్ కి దొరుకుతారు అట్టి విషయం లో ప్రిన్సిపల్ వారియొక్క తల్లి తండ్రుల సమక్షంలో మందలించగ ఇట్టి విషయాన్ని మనసులో పెట్టుకొని ప్రిన్సిపల్ పై కక్ష పెంచుకుంటారు., ప్రిన్సిపల్ రూపారెడ్డి వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంటుందని భావించి సోషల్ మీడియాలో ఆదారాలు దొరకుండా హత్యపై అన్వేషనా చేసి హత్యకు పాల్పడి నగదును అపహరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.పథకంలో భాగంగా వీరిద్దరు గత వారం రోజులనుండి ప్రిన్సిపల్ రూపారెడ్డి ని అంతమొందించాలని సాంకేతికంగా దొరకాకుండా రెక్కి నిర్వహించి వారి ప్రణాళికలో భాగంగా మంగళవారం సాయంత్రం సుమారు 4 గంటలకు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లి, బ్యాగులో నుంచి ఎరుపు రంగు హుడీ టీషర్ట్, ప్యాంట్ తీసుకుని వచ్చాడు. అనంతరం కొండమల్లేపల్లిలో ఇద్దరు కలిసి కత్తి, గ్లౌజులు కొనుగోలు చేశారు.రూపారెడ్డి ఇంటి సమీపంలోని వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని, ఎవరైనా వస్తున్నారా అని ఒకరు గమనిస్తుండగా మరొకరు ఇంటి వెనుక భాగం నుంచి లోపలికి ప్రవేశించాడు. అప్పటికే తెరిచి ఉన్న వంటగది ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూపారెడ్డిపై కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.అనంతరం బెడ్‌రూమ్‌లో ఉన్న 2.50 లక్షల నగదును తీసుకుని ఇంటి వెనుక గోడ దూకి నిర్మానుష్య ప్రాంతం నుంచి వెళ్లిపోయారు. కత్తి, గ్లౌజులు, మాస్క్, సెల్‌ఫోన్‌ను చెట్ల పొదల్లో పడేశారు. కొంత దూరంలో బట్టలు మార్చుకుని, ఎరుపు రంగు హుడీని డ్రైనేజీలో వేసి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు విచారణలో వెల్లడైంది.

స్వాధీనం చేసుకున్న వస్తువులు..

పోలీసులు నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదు, మృతురాలి ఐఫోన్, హత్యకు ఉపయోగించిన కత్తి, చేతి గ్లౌజులు, మాస్కులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును ఛేదించడంలో విశేష ప్రతిభ కనబరిచిన దేవరకొండ డీఎస్పీ వీ.ఎ. శ్రీనివాసరావు, మల్లెపల్లి సీఐ ౘా. నవీన్ కుమార్, జజూ ఇన్‌స్పెక్టర్ వీ. జితేందర్ రెడ్డి, మల్లెపల్లి ఎస్ఐ ౘా. రమేష్, చింతపల్లి ఎస్ఐ వీ. రామ్మూర్తి, గుడిపల్లి ఎస్ఐ ఙ. నరసింహులు, గుర్రంపోడు ఎస్ఐ చీ. వెంకన్న, జజూ ఎస్ఐ ఖ. సురేష్, హెడ్ కానిస్టేబుళు కరుణాకర్, విష్ణువర్ధనగిరి, వహీద్ పాషా, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, ప్రసాద్ రావు, ఫయాజ్, ప్రభాకర్, కానిస్టేబుళ్లు హేము నాయక్, గులాం దస్తగిరి, సాయికుమార్, శివరాజ్, వీణ జునైద్ అహ్మద్, నరేష్, సాయి, ఖ. కమల్ కిషోర్, వేణుగోపాల్ రెడ్డి, భాస్కర్, శరన్ రెడ్డి, నాగరాజు, అనిల్, హెచ్‌జీ శేఖర్‌లను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు అభినందించి రివార్డులు ప్రకటించారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, కేసులో ప్రతి చిన్న ఆధారాన్ని కూడా శాస్త్రీయంగా విశ్లేషిస్తూ, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసు బృందాల కృషి అభినందనీయమని తెలిపారు. నేరం చేసిన వారు ఎంత తెలివిగా వ్యవహరించినా శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయంతో దర్యాప్తు చేస్తే నేరాన్ని ఛేదించవచ్చని పేర్కొన్నారు.

## పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజానికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు.మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది.కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు.కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది.కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528